నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, శుక్రవారం 11 ఏప్రిల్ 2025 | VIKARABAD

బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్‌ను గోడపై అంటిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

రజతోత్సవంతో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
సత్తా చాటుదాం

- షాద్‌నగర్ పట్టణంలో బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశం
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, ఇతర నాయకులు

షాద్‌నగర్, ఏప్రిల్ 10 : వరంగల్ రజతోత్సవ సభతో బీఆర్ఎస్ సత్తా ఏమిటో చాటుదామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులను బనాయిస్తున్నదని, ఆ కేసులకు ఎవరూ భయపడొద్దని, రానున్నది మన కేసీఆర్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. గురువారం షాద్‌నగర్ పట్టణంలో బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన వరంగల్ బహిరంగ సభ వాల్ పోస్టర్లను మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో కలిసి ఆవిష్కరించి, గోడలకు అంటించి మాట్లాడారు. నాటి ఉమ్మడి రాష్ట్రంలో పాలమూరు జిల్లా అంటేనే వలస జిల్లా అనే పేరు ఉండేదని, కానీ, కేసీఆర్ నాయకత్వంలో స్వరాష్ట్రాన్ని సాధించుకున్న అనంతరం మహబూబ్‌నగర్ జిల్లా ఏ స్థాయిలో అభివృద్ధి చెందిందో మనకు కండ్ల ముందే కనిపిస్తున్నదని గుర్తు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అలవి కాని హామీలు ఇచ్చి.. అన్ని వర్గాలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని.. పవర్‌లోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీల్లో ఒక్కదానిని కూడా సక్రమంగా అమలు చేయలేదని మండిపడ్డారు. రేవంత్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందిపడుతున్నారని.. మళ్లీ కేసీఆర్ పాలన కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్‌తోనే రైతులు లాభపడతారని.. సాగునీటి ప్రాజెక్టులు వస్తాయన్నారు.

ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, రైతులు, అన్ని వర్గాల వారు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ షాద్‌నగర్ పట్టణంలో బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ వాల్ రైటింగ్ చేసిన అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల చిరకాల వాంఛను కేసీఆర్ నెరవేర్చి రాష్ట్రాన్ని సాధించి..అన్ని రంగాల్లో తెలంగాణను అగ్రగామిగా నిలిపారని కొనియాడారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా.. ప్రజలు మాత్రం కేసీఆర్‌ను మరువడంలేదన్నారు. ఆయనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈటె గణేశ్, సహకార సంఘాల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజావరప్రసాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నటరాజన్, నాయకులు నారాయణరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, యుగేందర్, వెంకట్రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కిశోర్, నర్సింహ, చెట్ల నర్సింహ, శేఖర్, అంతయ్య, మర్రిపల్లి నర్సింహ, భిక్షపతి, సుధీర్, షబ్బీర్ లాల, అశోక్, నవీన్, రమేశ్, సంతోష్, రామకృష్ణ, యాదగిరి, నరహరి, శ్రీకాంత్‌గౌడ్, శ్రీనివాసులు, రాజశేఖర్, సు శాంత్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గం నుంచి 5000 మంది..



వరంగల్ బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు నియోజకవర్గం నుంచి 5,000 మంది నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాం డూరు నియోజకవర్గాల నుంచి సుమారుగా 15,000 మంది సభకు తరలివెళ్లేలా బస్సులు, ఇతర వాహనాలను అందుబాటులో ఉంచుతున్నాం. ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, నాయకులు అధికంగా తరలివచ్చేలా మండలాల వారీగా సమావేశాలను నిర్వహిస్తున్నాం. పార్టీ ఏర్పాటై 25 ఏండ్లు అవుతున్న సందర్భంగా కార్యకర్తలందరూ భారీగా తరలివచ్చి వరంగల్ సభను విజయవంతం చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైంది. అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నది. ప్రజలు మళ్లీ కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు.

- కొప్పుల మహేశ్‌రెడ్డి, పరిగి మాజీ ఎమ్మెల్యే

ఊరూవాడా.. ఒక్కటై కదులుదాం

- వరంగల్ రజతోత్సవ సభను సక్సెస్ చేద్దాం
- వికారాబాద్ జిల్లా నుంచి తరలివెళ్లనున్న బస్సులు 180-200
- సభకు వెళ్లే ముందు గ్రామాలు, వార్డుల్లో పార్టీ జెండాలను ఎగురవేయాలి
- వికారాబాద్‌లో జరిగిన వికారాబాద్, పరిగి, తాండూరు సెగ్మెంట్ల సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్
- పాల్గొన్న మహేశ్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, శుభప్రద్ పటేల్, ఇతర నేతలు

సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్, చిత్రంలో పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్

వికారాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు ఊరూవాడా.. ఒక్కటై కదిలి విజయవంతం చేద్దామని ఆ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం లో వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాల ముఖ్య నాయకులు, తాండూరు, పరిగి మాజీ ఎమ్మెల్యేలు పైలట్ రోహిత్‌రెడ్డి, కొప్పుల మహేశ్‌రెడ్డిలతో కలిసి బీఆర్ఎస్ ఏర్పడి 25 వసంతాలు పూర్తి కావస్తున్న సందర్భంగా రజతోత్సవ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికంగా తరలివచ్చేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ము ఖ్యంగా యువకులు భారీగా వచ్చేలా మండలాల వారీ గా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. అయితే, జిల్లా నుంచి వరంగల్ రజతోత్సవ సభకు 180-200 బస్సులతోపాటు నాయకుల సొంత వాహనాల్లోనూ తరలి

వెళ్లనున్నామన్నారు. సభకు వెళ్లే ముందు గ్రామాలు, వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ జెండాలను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. అనంతరం చలో వరంగల్ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. సమావేశంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజూగౌడ్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు రాంరెడ్డి, వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాలకు చెందిన అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సర్కార్ అన్నింటిలోనూ విఫలమే..

కాంగ్రెస్ సర్కార్ హామీల అమల్లో పూర్తిగా విఫలమైంది. అమలుకు సాధ్యంకాని హామీలిచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసింది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి.. కేసులకు ఎవరూ భయపడొద్దు.. బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను మనమే కైవసం చేసుకుంటాం. అదేవిధంగా పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను ఊరూరా పండుగలా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలి. వరంగల్ సభకు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలి. సభకు వెళ్లే ముందు పార్టీ జెండాలను అన్ని గ్రామాలు, వార్డుల్లో ఎగురవేయాలి.

– పైలట్ రోహిత్‌రెడ్డి, తాండూరు మాజీ ఎమ్మెల్యే

రాని బిల్లులు.. ఆగిన నిర్మాణాలు

- మధ్యలోనే నిలిచిన ఇందిరమ్మ ఇండ్లు
- ఇప్పటికే అప్పులు తీసుకొచ్చి చేపట్టిన నిర్మాణాలు
- రంగారెడ్డి జిల్లాలోని 21 పైలెట్ గ్రామాల్లో 1,442 మంది లబ్ధిదారుల ఎంపిక
- బేస్‌మెంట్ వరకు పూర్తైన 58 ఇండ్లు .. ఇప్పటికీ లబ్ధిదారులకు రూపాయీ మంజూరు కాని వైనం

పిల్లర్లు పూర్తయి స్లాబ్ వరకు వచ్చి నిలిచిన ఇందిరమ్మ ఇంటి పనులు

రంగారెడ్డి, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ) : ప్రజాపాలనలో భాగంగా గుర్తించిన పైలెట్ గ్రామాల్లో ఇందిరమ్మ లబ్ధిదారులకు బిల్లులు రాక నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. కా గా, జిల్లాలోని 21 మండలాల్లో 21 గ్రామాలను ప్రజాపాలనలో పైలెట్ గ్రామాలుగా అధికారులు ఎంపిక చేశారు. ఈ పథకం కింద ఒక్కొక్క లబ్ధిదారుడికి రూ.ఐదు లక్షలు ఇవ్వనుండడంతో పేదలు చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రతి గ్రామానికీ 70 నుంచి 100 మంది వరకు లబ్ధిదారులు అప్లికేషన్ పెట్టుకోగా.. అధికారులు మా త్రం 1,442 మందిని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులుగా ఎం పిక చేశారు. అందులో ఇప్పటివరకు 300 మంది మాత్రమే ఇండ్ల నిర్మాణానికి ముగ్గులు పోయగా.. 58 ఇండ్లు బేస్‌మెంట్ల వరకు పూర్తి కాగా వాటి లబ్ధిదారులు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి రూపాయి కూడా రాలేదని.. అప్పులు తీసుకొచ్చి బేస్‌మెంట్ వరకు నిర్మించినట్లు.. ప్రస్తుతం పనులను నిలిపేసినట్లు పలువురు లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ఆ బిల్లులను త్వరగా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఉన్న ఇంటిని కూలగొట్టి..

ప్రజాపాలనలో సొంతింటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల వరకు ఉచితంగా ఇస్తామని ప్రకటించటంతో కప్పాడు గ్రామానికి చెందిన జెంగిలి లక్ష్మమ్మ అనే మహిళ ఉన్న ఇంటిని కూలగొట్టి.. ఆ స్థలంలో కొత్త ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించింది. గ్రామంలోని కమ్యూనిటీ హాల్‌లో కుటుంబంతో కలిసి జీవిస్తున్నది. ఇప్పటివరకు ఇంటి నిర్మాణం బేస్‌మెంట్ వరకు పూర్తైనా ప్రభుత్వం నుంచి రూపాయీ రాకపోవడంతో ఆ పనులను నిలిపేసింది. ఇంటి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసుకుందామని ఉన్న ఇంటిని కూలగొట్టి.. తెలిసిన వారి వద్ద వడ్డీని డబ్బును తీసుకొచ్చి కొత్త ఇంటి పనులను చేపడితే.. ప్రభుత్వం నుంచి బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. అధికారులు స్పందించి బిల్లులు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నది.

బిల్లులు త్వరగా చెల్లించాలి..

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు ప్రభుత్వం త్వరగా బిల్లులను చెల్లించాలి. చాలామంది ఉన్న ఇండ్లను కూలగొట్టి, ఆ స్థలాల్లో ఇండ్ల నిర్మాణ పనులను చేపట్టి.. బేస్‌మెంట్ వరకు పూర్తి చేశారు. ఆ పనులకు ఇంకా రూపాయీ రాకపోవడంతో మిగిలిన పనులను చేపట్టే స్థితిలో లబ్ధిదారులు లేదు. ప్రభుత్వం స్పందించి త్వరగా బిల్లులను చెల్లించి, ఆదుకోవాలి.

--చెరువుకింది సురేశ్, కప్పాడు

అప్పులు చేసి బేస్‌మెంట్ వరకు పూర్తి చేశా.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా కొత్త ఇంటిని నిర్మించేందుకు ఉన్న ఇంటిని కూలగొట్టి.. ఆ స్థలంలో నిర్మాణ పనులు ప్రారంభించా. ప్రస్తుతం గ్రామంలోని కమ్యూనిటీహాల్‌లో కుటుంబంతో కలిసి జీవిస్తున్నా. ప్రభుత్వం వెంటనే బిల్లులను చెల్లిస్తే స్లాబ్ వేసుకుని మళ్లీ ఆ ఇంట్లోకి వెళ్లిపోతా.

బిల్లుల కోసం నిబంధనలెన్నో..

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి లబ్ధిదారులకు ఇచ్చే రూ. ఐదు లక్షలను నాలుగు విడతలుగా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. బేస్‌మెంట్ స్థాయి వరకు నిర్మించిన వారికి రూ. లక్ష, ఆపైన నిర్మాణాలు జరిపిన వారికి లక్షాయాభై వేలు, లక్షాయాభై వేలు రెండు దఫాలుగా, ఇండ్ల నిర్మాణం పూర్తైన తర్వాత రూ.లక్ష ఇస్తామని ప్రకటించింది. అయితే, బేస్‌మెంట్ వరకు నిర్మాణాలు పూర్తి కాగానే రావాల్సిన లక్షరూపాయల బిల్లులు మాత్రం ఇంకా రావడం లేదు. బేస్‌మెంట్ నిర్మాణం పూర్తైన లబ్ధిదారుల రూ.లక్ష బిల్లు కోసం వారు బ్యాంకులో అకౌంట్ తెరిచి ఆధార్‌లింకు చేయాల్సి ఉంటుం ది. ఆధార్ లింక్ కాగానే బేస్‌మెంట్ వరకు చేపట్టిన నిర్మాణం వద్ద లబ్ధిదారులు ఫొటోలు దిగి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాతే బిల్లులు వారికి మంజూరవుతాయి.

కమ్యూనిటీహాల్‌లో నివాసముంటున్న సత్యమ్మ

రోడ్ల నిర్వహణలో
బెడిసికొట్టిన వ్యూహం!

- పాత పద్ధతిలోనే సీఆర్ఎంపీ పనులు
- ఏజెన్సీలను పక్కన పెట్టిన అధికారులు
- ప్రైవేట్‌కు అప్పగించేందుకు ప్రతిపాదనలు
- సర్కార్ నిర్ణయం కోసం బల్దియా ఎదురుచూపులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇతర మెట్రో నగరాలకు ఆదర్శంగా నిలిచిన సీఆర్ఎంపీ పథకాన్ని తిరిగి పునఃప్రారంభించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. కేసీఆర్ పథకాలను ఆనవాళ్లు లేకుండా చేస్తామన్న రేవంత్ సర్కార్‌కు క్షేత్రస్థాయిలో సాధ్యం కాదని తేలిపోయింది. ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ పథకాల స్థానంలో హెచ్‌సిటీ ప్రాజెక్టును తెరపైకి తీసుకొచ్చి.. పాత ప్రతిపాదనలనే పట్టాలెక్కిస్తున్నది. తాజాగా సీఆర్ఎంపీ పథకాన్ని తిరిగి కొనసాగించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు సీఆర్ఎంపీ కింద రోడ్ల నిర్వహణ బాధ్యతలు ప్రైవేట్ ఏజెన్సీలకు ఇచ్చేందుకు ప్రభుత్వ అనుమతి కోరుతూ జీహెచ్ఎంసీ ప్రతిపాదనలు సమర్పించింది. అయితే సీఆర్ఎంపీ మొదటి విడతతోపాటు రెండో విడత పథకానికీ మళ్లీ టెండర్లు పిలిచి కొత్త ఏజెన్సీలకు అప్పగించడమా? లేక పాత ఏజెన్సీలకు ఇవ్వడమా అన్న రెండు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించినట్లు తెలిసింది.

మెట్రో నగరాలకు ఆదర్శంగా..

ఎల్లవేళలా సాఫీగా ప్రయాణానికి అనువుగా ఉండాలి.. ఇది కాంప్రెహెన్సివ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రామ్ (సీఆర్ఎంపీ) లక్ష్యం ..ప్రధాన రహదారుల నిర్వహణలో భాగంగా 510 విభాగాలుగా విభజించి తొలి విడతగా 744.220 కిలోమీటర్ల రహదారిని 2020లో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రైవేట్ ఏజెన్సీలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. నిర్ణీత గడువులో మొదటి విడతను పూర్తి చేసి గుంతలు లేని నగరంగా తీర్చిదిద్దింది. ఈ సీఆర్ఎంపీ విధానం ఇతర మెట్రో నగరాలకు ఆదర్శంగా నిలిచింది. ఈ పథకాన్ని కొత్త ప్రభుత్వం అనుసరించకపోవడంపై విమర్శలొచ్చాయి. కొన్ని నెలలుగా ప్రైవేట్ ఏజెన్సీలను పక్కన పెట్టి సొంతంగా జీహెచ్ఎంసీ నిర్వహణ చేపడుతున్నది. ఈ నేపథ్యంలోనే మొదటి విడత పథకం నిర్వహణను మళ్లీ ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడంతోపాటు కొత్తగా రెండో విడతలో రూ. 424 కోట్లకుగానూ 398.32 కిలోమీటర్ల మేరలో రూ.1334 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రెండు విడతలు కలిపి 934 ప్రాంతాల్లో 1142.54 కిలోమీటర్ల మేరలో రూ.3825 కిలోమీటర్లలో సీఆర్ఎంపీ రోడ్ల నిర్వహణ ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు ప్రభుత్వానికి అందజేశారు.

చౌడాపూర్ మండలంలోని లింగంపల్లిలో ఎండిపోయిన వరి పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారిణి పరిమళ, ఏఈవో విశ్వనాథం

పంటల వివరాలు
ప్రభుత్వానికి పంపిస్తాం

నమస్తే ఎఫెక్ట్

లింగంపల్లిలో ఎండిపోయిన పంటను పరిశీలించిన వ్యవసాయాధికారులు

కులకచర్ల, ఏప్రిల్ 10 : చౌడాపూర్ మండలంలోని లింగంపల్లి గ్రామంలో భూగర్భజలాలు తగ్గి బోర్లు వట్టిపోయి పంటలు ఎండిపోతున్నాయని..ఎండిపోతున్న పంటలు.. అన్నదాత దిగాలు అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి చౌడాపూర్ మండల వ్యవసాయశాఖ అధికారులు స్పందించారు. వ్యవసాయాధికారిణి పరిమళ, ఏఈవో విశ్వనాథం గురువారం లింగంపల్లి గ్రామ పరిధిలో వేసిన వరి పంటను పరిశీలించారు. ఎండిపోయిన పంట వివరాల నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని వారు తెలిపారు.